ప్రజాశక్తి
బుధవారం 11 సెప్టెంబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



నీటిలో ఉన్న కంద పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

పంట చేతికందే సమయానికి
వరద ముంచేసింది.!

- రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి నష్టపోయాం..
- ఏపీ రైతు సంఘం నేతల ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట నోటికందే సమయానికి ప్రకృతి వరద రూపంలో ముంచేసిందని రైతులు ఏపీ రైతుసంఘం నేతల బృందం ఎదుట వాపోయారు. ఇప్పటికే కంద పంటకు ఎకరాకు మూడు లక్షల వరకు పెట్టుబడి పెట్టి.. తీవ్రంగా నష్టపోయామన్నారు. ఒక్కో రైతు రెండు ఎకరాల నుండి పది ఎకరాల వరకు సాగు చేయగా రూ.లక్షల రూపాయల నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఏపీ రైతు సంఘం, కౌలు రైతుసంఘం రాష్ట్ర బృందం లంక గ్రామాలైన భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బందం స్థానిక రైతులతో చర్చించి జరిగిన పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణా నది వరదలకు లంక గ్రామాల్లో దెబ్బతిన్న పంటలతో ▶ 2లో

అన్నదాతలకు అపార నష్టం

- వరదల కారణంగా 86 వేల ఎకరాల్లో పంటలకు తీవ్రనష్టం
- ముంపునకు గురయిన 24 లంక గ్రామాలు
- నేడు బాపట్ల జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



కొల్లూరు మండలం ఈపూరులంకలో ఉరకెత్తిన పసుపు పంట

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భారీ వర్షాలు, వరదల కారణంగా బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాలలోని 24 గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. నివాసాలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని 86 వేల ఎకరాల్లో వ్యవసాయ పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. వరి, అరటి, పసుపు, కంద, గుమ్మడి, తమలపాకులు, కూరగాయల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పది రోజులుగా లంక గ్రామాల పరిధిలో ఉన్న అన్ని రకాల పంట పొలాలు వరదనీటిలోనే ఉండి ఉరకెత్తుతున్నాయి. మొన్నటివరకు పచ్చ గా కళకళలాడిన పంటపొలాలు మాడిపోయి, మురుగునీటిలో దుర్గంధంతో ఉన్నాయి. జిల్లాలోని అన్ని రకాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. లంక గ్రామాలు అన్నింటా వరదనీరు కరకట్టల వరకు రావడంతో పంటపొలాలన్నీ గడిచిన 10 రోజులుగా నీటిలోనే ఉండిపోయాయి.

జిల్లాలో వరి పైరు, ఉద్యానవన పంటలకు తీవ్రనష్టం జరిగింది. వరద తాకిడికి ముదురు అరటి తోటలు మొదళ్ల దెబ్బతిని విరిగి పడి పోగా, లేత అరటి తోటలు నీటిలో ఉండి ఉరకెత్తాయి. పసుపు, కంద పొలాలు నీటిలో ఉన్న కారణంగా మురిగిపోయాయి. వరదల కారణంగా ఏ పంట కూడా రైతు చేతికి అందివచ్చే పరిస్థితి లేకపోయింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని పంటలు అన్ని చాలా రోజులుగా నీటిలో ఉండిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో ఉన్న వరదనీరు పూర్తి రెండో పంట వేయాలంటే మరో నెలకు పైగా పడుతుందని రైతులు చెబుతున్నారు. వరదనీరు తగ్గితే తిరిగి దుక్కులు దున్ని మినుము, మొక్కజొన్న లాంటి పైర్లు సాగు చేయడం సాధ్యపడుతుంది. కాగా వరదల ▶ 2లో

నామినేషన్ పనుల పేరుతో
దోపిడీ.!



- మేయర్, అధికారుల భాగస్వామ్యంతో నిబంధనలు గాలికి..
- పర్సంటేజీల కోసం కార్పొరేషన్ ఖజానాకు గండి
- స్టాండింగ్ కమిటీలో లుకలుకలతో వెలుగులోకి విషయం
- విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న పలువురు కార్పొరేటర్లు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి ఒంగోలు కార్పొరేషన్ ఖజానాకు గండికొట్టారు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు కార్పొరేషన్ సొమ్మును పంచుకున్నారు. ఎలాంటి విపత్తులు లేకున్నా నామినేషన్ పనులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టి అందినకాడికి జేబులో వేసుకున్నారు. ఇందులో పాలకవర్గ పెద్దకు పెద్దమొత్తంలో ముట్టినట్లు సమాచారం.

కార్పొరేషన్ పరిధిలో వివిధ పనులు చేసే బాధ్యతను నామినేషన్ పద్ధతిలో కొంతమంది కాంట్రాక్టర్లకు అప్పగించారు. మొత్తం 19 పనులు చేసేందుకు నామినేషన్ పద్ధతిలో మేయర్ అనుమతులు ఇచ్చారు. ఒక్కో పని విలువ రూ.5 లక్షలు.. మొత్తం పనుల విలువ రూ.95 లక్షలు. ఇందులో అత్యవసర పనులు ఏమీ లేవు. ఐదు మాసాల వ్యవధిలోనే మొత్తం పనులు చేసినట్లు చూపారు. కార్పొరేషన్‌లో రూ.లక్ష దాటిన ఏ పనినైనా టెండర్ పద్ధతిలో చేపట్టాల్సి ఉంది. అయితే ఇక్కడ ఎలాంటి టెండర్లూ నిర్వహించలేదు. నిబంధనలు గాలికొదిలేశారు. సాధారణంగా విపత్తులు, ఇతర ఎమర్జెన్సీ వచ్చినప్పుడు మాత్రమే నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగిస్తారు. అయితే ఇక్కడ చేసిన నామినేషన్ పనుల్లో ఎక్కడా అత్యవసర పనులు లేకపోవడం గమనార్హం. అంచనా విలువలకే పనులు ఇవ్వడం ద్వారా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు, కాంట్రాక్టర్లు అంతా లాభపడ్డారని తెలిసింది.

ఏమేమి పనులు చేశారంటే.?

శానిటేషన్ విభాగంలో చెత్తను సేకరించేందుకు కార్మికులు వినియోగించే పుష్‌కాట్లను రిపేర్లు చేయడం, వాటికి రంగులు వేయడం, పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె సరఫరా చేయడం. వారికి గ్లౌజులు, ఎప్రాన్స్ అందించడం, చీపుర్లు, దంతెలు, పలుగు, పారలు అందించడం, గుత్తికొండవారిపాలెం, కొత్త మామిడిపాలెం డంపింగ్ యార్డు పాయింట్ల వద్ద చెత్తను చదును చేయడం, తరలించేందుకు గానూ ఎక్కువ కెపాసిటి ఉన్న వాహనాన్ని అద్దె ప్రాతిపాదికన సమకూర్చడం, నగరంలో పలు చోట్ల పెద్ద కెపాసిటి లైట్లు, ఎల్ఈడి లైట్లను రిపేరు చేయడం, నార్త్ బైపాస్ నుంచి మగమూరు రోడ్డు జంక్షన్ వరకు డివైడర్లను శుభ్రం చేయడం లాంటి పనులు ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఫిబ్రవరి 23న అగ్రహారం వద్ద జరిగిన గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ కార్యక్రమంలో డయాస్‌ఏరియా, వాహనాల పార్కింగ్ ఏరియాలో నీటిని అందించినందుకు గానూ రూ.10 లక్షలు కేటాయించారు. ఇలా నామినేషన్ పద్ధతుల్లో పనులు చేశారు.

కార్పొరేషన్‌కు రూ.20 లక్షల నష్టం..

టెండర్ విధానంలో కాకుండా నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించినందున కార్పొరేషన్ ఖజానాకు సుమారు రూ.20 లక్షలు నష్టం వాటిల్లింది. ఏదైనా ▶ 2లో

రేషన్ దందా యథాతథం

- నియోజకవర్గాల్లో ముఖ్యనేతలే సూత్రధారులు
- వ్యాపారులతో నెలవారీ ముడుపుల ఒప్పందాలు చేసుకున్న నేతలు
- తినే బియ్యం ఇవ్వనందున బండ్ల వద్దే డబ్బులు తీసుకుంటున్న లబ్ధిదారులు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పాలకులు మారినా రేషన్ దందా ఆగలేదు. వైసిపి పోయి కూటమి ప్రభుత్వం వచ్చిందంటే.. మిగతా దంతా సేమ్ టు సేమ్ అన్నట్లుగానే సాగుతోంది. రేషన్ దుకాణాలు వైసిపి నేతల నుంచి తెలుగుదేశం, జనసేన నేతలు తీసుకున్నారు. అప్పుడు వైసిపి నేతలు మిగిలిపోయిన బియ్యాన్ని వ్యాపారులకు అమ్ముకున్నారు. ఇప్పుడు అదే పని తెలుగుదేశం నేతలు చేస్తున్నారు. రాజకీయ పార్టీ నేతలకు ఇదొక ఆదాయవనరుగా మారింది. బియ్యం అమ్ముకోవడానికి కేవలం ప్రభుత్వమే కారణం. ఎందుకంటే పేదలు తినే బియ్యం ఇవ్వనందున ఎవరూ తీసుకోవడం లేదు. నెలలో 30 నుంచి 40 శాతం కూడా జనం తీసుకోవడం లేదు. అన్నీ మిగిలిపోతున్నాయి. వాటిని అమ్మేస్తున్నారు. ఈ బియ్యాన్ని కూటమి నేతలు రైసు మిల్లులకు తీసుకుపోయి పాలిష్ వేసి బహిరంగ మార్కెట్‌లో సాధారణ ధరలకు అమ్ముకుంటున్నారు. ఇలాంటి మోసపూరిత దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

రేషన్ బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గానీ, కేంద్రం గానీ సబ్సిడీ రూపంలో రూ.30కు పైగా కేటాయిస్తున్నాయి. పేదలకు బియ్యం ఇచ్చే పథకం ఏళ్లతరబడి అమలులో ఉంది. పేదల్లో పౌష్టికాహారలోపంనివారణకు ఈపథకం అమలులో ఉంది. అయితే ఇచ్చే బియ్యం నాణ్యత లేనివిగా ఉన్నాయి. తినే బియ్యం ఇవ్వడం లేదు. దీంతో ఈ పథకం నిరర్ధకమా? ప్రయోజనమా? అంటే ఏ సమాధానం కూడా చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే దీనిపై ఏ విమర్శలు చేసినా ఎక్కడ రద్దు చేస్తారోనన్న భయం కూడా పేదల్లో ఉంది. అయితే రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే బియ్యం నాణ్యత లేనివి. అందులో ఎలాంటి సందేహం లేదు. సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర వసతి గృహాలకూ ఈ బియ్యాన్నే ఇస్తున్నారు. వాళ్లూ నిత్యం ఈ బియ్యంతో వండిన అన్నం తినలేక అస్వస్థలకు గురవుతుంటారు. పేదలు కూడా ఈ బియ్యం తినడానికి ఇష్టపడటం లేదు. సన్నబియ్యం ఇవ్వాలనే చర్చ చాలా కాలంగా ఉంది. దీనిపై పాలకులు దృష్టి పెట్టడం లేదు. కోట్లాది రూపాయలు సబ్సిడీల ▶ 2లో

అన్నదాతలకు అపార నష్టం

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా కౌలు రైతులు బాగా నష్టపోయారు. ఎకరాలకు రూ.60 వేల నుంచి 70 వేల వరకు కౌలుపై పంటల సాగు చేశారు. కంద సాగుకు రూ.2.50 లక్షలు, తమలపాకుల తోటల సాగుకు రూ.లక్ష, పసుపు సాగుకు రూ.70 వేలు, అరటికి రూ.50 వేల వరకు రైతులకు పెట్టుబడి ఖర్చయింది. ఈ నేపథ్యంలో కేంద్ర బృందం నేడు బాపట్ల జిల్లాలో వరద ముంపునకు గురయిన లంకగ్రామాల్లో పర్యటించనుంది. ఇప్పటికే జిల్లాలో పంటనష్టం అంచనాలు రూపొందించారు. దెబ్బతిన్న గృహాల సర్వే జరిగింది. మంగళవారం జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా అధికారులు కేంద్రబృందం పర్యటించనున్న ప్రాంతాల్లో ఉన్న పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.

కొందరికి ఖేదం...కొందరికి మోదం

భారీ వర్షాల వల్ల జిల్లాలోని వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని రైతులకు నష్టం వాటిల్లగా బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలకు ఊరటనిచ్చాయి. జూలై నెల నుంచి వర్షాల కోసం ఈ ప్రాంత రైతులు ఎదురు చూస్తున్నారు. సాగునీటి కోసం అలమటిస్తున్న రైతులకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయి. మాగాణి సాగుకు, ఆరుతడి పంటలకు రైతులు సన్నద్ధమయ్యారు. రాష్టంలోని రిజర్వాయర్లన్నీ నిండిపోయి, గత కొన్ని రోజులుగా లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతున్నా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సాగర్ కుడి కాలువ కింద వరిసాగు ప్రశ్నార్థకంగానే మారింది. గడిచిన రెండు సీజన్లలోనూ సాగర్ కాలువ కింద వరిసాగు చెయ్యడం సాధ్యపడలేదు. మాగాణి సాగుకు సరిపడా సాగునీరు ఇవ్వలేని పరిస్థితి కారణంగా రైతులు వరి సాగుకు బదులు ఆరుతడి పంటల సాగు చేశారు. దీంతో జిల్లాలో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ఈ ఖరీఫ్ సీజన్‌కు అయినా సాగర్ కాలువకు సక్రమంగా సాగునీటిని విడుదల చేస్తే వరిసాగు సాధ్యపడుతుందని రైతులు చెబుతున్నారు.

రూ.25 వేల చొప్పున సాయం చేయాలి

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

వరద ముంపు ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికీ రూ.25 వేలు ఆర్థిక సాయం చెయ్యాలి. విద్యుత్ బిల్లులు, ఇంటి పన్ను రద్దు చెయ్యాలి. డ్వాక్రా రుణాల కిస్తీలు వాయిదా వేసి, వడ్డీని ప్రభుత్వమే చెల్లించాలి. రైతులు పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడికి అనుగుణంగా నష్టపరిహారం రూ 50 వేలకు తగ్గకుండా ఇవ్వాలి. వరద ముంపు ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం 3 నెలల పాటు ఆదుకోవాలి. వరద తగ్గాక రైతులు వేసే రెండో పంట కోసం విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి. కరకట్టలను పటిష్టపరచాలి. డ్రయిన్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. గహాలు నష్టపోయిన వారికి తక్షణమే పరిహారం అందించాలి. ముంపునకు గురయిన అందరికీ పరిహారం అందించాలి. రెండు వారాలుగా పనులు లేక ఇళ్లకే పరిమితం అయిన వ్యవసాయ కూలీలను, కౌలు రైతులను, చిన్న, సన్నకారు రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. పనులు దొరికేంత వరకు ఆర్థిక చేయూతనివ్వాలి.



తిరుమలలో కందుల నారాయణరెడ్డితో పలువురు టిడిపి నాయకులు

తిరుమలలో ఎమ్మెల్యే కందుల

ప్రజాశక్తి-పొదిలి

శాసనసభ్యులుగా ఎన్నికైన తరువాత తొలిసారిగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో మంగళవారం తిరుమలలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఆయన సతీమణి వసంతలక్ష్మి, కుమార్తె భవ్య నందిని, రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ సురేఖ దంపతులు, మార్కాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున దంపతులు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ దంపతులు తదితరులు ఉన్నారు.

నామినేషన్ పనుల పేరుతో దోపిడీ.!

(మొదటిపేజీ తరువాయి)

పనికి సంబంధించి టెండర్ పిలిస్తే దాదాపు 15 నుంచి 20 శాతం వరకు లెస్‌లకు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తారు. కొన్ని సందర్భాలలో 25 నుంచి 30 శాతం లెస్ మీద కూడా పనులు చేసేందుకు పోటీ పడతారు. లెస్ అమౌంట్ అంతా కార్పొరేషన్‌కు మిగులుతుంది. ఎటు చూసినా రూ.95 లక్షల విలువైన పనుల్లో ఎలాంటి పోటీ లేకుండా అంచనా విలువకే పనులు ఇవ్వడంతో కార్పొరేషన్‌కు సుమారు రూ.20 లక్షల మేర నష్టం వచ్చింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే నామినేషన్ పద్ధతిలో కాకుండా టెండర్ పద్ధతిలో పనులు చేసినా ఎవరి వాటా వారికి వెళ్లాల్సిందే.. ఇక్కడ పోటీనే లేకుండా పనిచేసినందున వాటాల 'బరువు' బాగానే తూగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

వీరు బాగుపడ్డారట..?

టెండర్ విధానం లేకుండా నామినేషన్ పద్ధతిలో పనులు చేసినందుకు గానూ పనులు ఇచ్చిన వారికి 20 శాతం, అధికారులకు 20 శాతం వాటాగా ఒప్పందం కుదిరినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మొత్తం పనిలో 40 శాతం వాటాలకే పోయింది. ఇక కాంట్రాక్టర్‌కు ఓ పావలా మిగలాలి కాబట్టి మరో 15 నుంచి 20 శాతం పోయింది. అంటే పర్సంటేజీలకైతేమి, కాంట్రాక్టర్‌కు మిగులుదల అయితేనేమీ పని అంచనాలలో మొత్తంగా 60 శాతం పోయింది. మిగిలిన 40 శాతం నిధులతో జరిగిన ఈ పనులు ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలతో జరిగాయో, అస్సలు ఏ మేరకు పనులు చేశారో అనే విమర్శలు వినిపిస్తున్నాయి. మేయర్, ఇంజినీరింగ్ విభాగం అధికారుల భాగస్వామ్యంలో ఈ పనులు జరిగాయి.

స్టాండింగ్ కమిటీలో పెట్టి ఆమోదం..

చేసిన పనులకు బిల్లులు చేసుకోనేందుక కౌన్సిల్ ఆమోదం కావాలి. కాబట్టి ఈ పనులు ఆమోదం కోసం మూడు మాసాల కిందట జరిగిన కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పెట్టి ఆమోదించుకున్నారు. రూ.40 లక్షల లోపు విలువైన ఏ పనినైనా ఆమోదించే హక్కు స్టాండింగ్ కమిటీకి ఉంటుంది. ఇక్కడ ఒక్కో పని విలువ రూ.5 లక్షలే కాబట్టి అన్నీ పనులకు ఆమోదం తెలిపారు. అయితే ఈ పర్సంటేజీల వ్యవహారంలో స్టాండింగ్ కమిటీలో ఒకరిద్దరికి మాత్రమే లబ్ధి చేకూరిందని తెలిసింది. మొత్తం ఐదు మంది ఉండే కమిటీలో ఒకరిద్దరికే న్యాయం చేకూరడం, పనులకు సంబంధించిన పర్సంటేజీలు అన్నీ ముందుగానే పంచుకున్న తరువాత స్టాండింగ్ కమిటీ ఆమోదానికి రావడంతో ఈ నామినేషన్ వర్కుల కథాంశం వెలుగులోకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ నామినేషన్ పనుల గురించి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు పలువురు కార్పొరేటర్లు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

రేషన్ దందా యధాతథం

(మొదటిపేజీ తరువాయి)

రూపంలో కేటాయిస్తున్నారు. సేకరించే బియ్యం తక్కువ రకంగా ఉంటున్నాయి. వాటిని దోసెలు, ఇతర పిండిపదార్థాల కోసం తప్ప అన్నంకోసం జనం ఉపయోగించడంలేదు.అదే మిల్లులకు వెళితే వాటి స్వరూపంమార్చి విక్రయాలు చేస్తే వాటినే అందరూ తింటున్నారు. జిల్లాలో 1392 రేషన్ దుకాణాలు న్నాయి. వాటి ద్వారా నెలనెలా 9,236 టన్నుల బియ్యం పేదలకు కేటాయించారు. మొబైల్ పంపిణీ యూనిట్ల ద్వారా వీటిని ఇంటింటికీ చేర్చుతున్నారు. అయితే ఈ బియ్యం 30నుంచి 40శాతం మాత్రమే లబ్దిదారులు తీసుకుంటున్నారు.అదీ నెలనెలా అందరూ తీసుకోవడంలేదు. ఒకనెలలో తీసుకుంటే మరో రెండు నెలలు తీసుకోవడంలేదు. వీటిని దోసెలకు, ఇతర పిండిపదార్థాలకు వాడుకుంటున్నారు. అన్నం కోసం ఈబియ్యాన్ని ఏ ఒక్కలబ్దిదారుడూ వినియోగించడం లేదు.ఇందులో ఎలాంటి సందేహం కూడా లేదు.వాహనాల వద్దనే బియ్యం వద్దంటే రూ.200 చేతిలో పెడుతున్నారు. కిలోకు రూ.10 ఇస్తున్నారు. నలుగురున్న కార్డుకు రూ.200 ఇచ్చేస్తున్నారు. బియ్యం అక్కడే ఉంటాయి. తీసుకున్నట్లుగా వేలిముద్ర తీసుకుని పంపుతారు. ఇలా మిగిలిపోయిన బియ్యాన్ని దుకాణాల నుంచి సేకరించి నియోజవర్గం మొత్తం ఒక కీలక నేతకు అప్పగిస్తున్నారు. వాళ్లు బయట వ్యాపారులకు నెలముడుపులు ఒప్పందాలు చేసుకుని ఇస్తున్నారు. సేకరణ, రవాణా అంతా డీలర్ల నుంచీ ఆ వ్యాపారులే చూసుకుంటారు. ఇందుకుగానూ రూ.30లక్షల నుంచీ రూ.40 లక్షలు వరకూ నియోజకవర్గస్థాయి నేతకు ముడుపులు ఇవ్వాల్సి ఉంది. ఎవరైతే ఈబియ్యాన్ని తీసుకునిపోయి బయట విక్రయాలు చేసుకుంటారో ఆ వ్యాపారే ఈ మొత్తాన్ని ఇవ్వాలి. అన్ని నియోజకవర్గాల్లో ఈ తరహా ఒప్పందాలు జరిగాయి. అధికారులు కూడా బియ్యం సేకరణ వ్యాపారులజోలికికూడా వెళ్లరు. ఎందుకంటే వారివాటా వారికుంది. ఇక కొందరు నేరుగా ఎమ్మెల్యేలే ఈ వ్యవహారాన్ని చూసుకుంటున్నారు. కొందరు మాత్రం ద్వితీయశ్రేణి నేతలకు అప్పగించారు. రేషన్ బియ్యం కాంటాక్టుల కోసం పాలకపక్ష నేతల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. అన్ని నియోజకవర్గాల్లో ఈ దందా నడుస్తోంది. నిజంగా పేదలు తినే బియ్యం ఇస్తే పథకం సార్థకత చేకూరుతుంది.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-సంతనూతలపాడు: స్థానిక సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంతనూతలపాడు వాస్తవ్యులు గ్రంధి వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. సుమారు 220 మందికి అన్నదానం చేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సెక్రటరీ చివుకుల రామ్ గోపాల్, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షురాలు షేక్ హసీనాబేగం, సభ్యులు వేమా కవిత, చలువాది చంద్రావతి, వేమా నాగరాజు, కొత్తపల్లి ఆంజనేయులు, శీలం మల్లారెడ్డి, మొనపాటి రామాంజనేయులు, గ్రంధి వెంకట సుబ్బారావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వరద ముంచేసింది.!

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు జరిగిన నష్టం ఏ ఒక్కరూ పూడ్చలేనిదని ఆందోళన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో లంక గ్రామాల్లో రైతులు సాగుచేసిన కందపంట పూర్తిగా దెబ్బతిని రైతులను కోలుకోలేని నష్టానికి గురిచేసిందన్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రెండున్నర లక్షల నుంచి మూడు లక్షల వరకు పెట్టుబడులు పెట్టి దెబ్బతిన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పసుపు పంటకు కూడా ఎకరాకు లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేశారని చెప్పారు. దీంతో పాటు అరటి, తమలపాకు, కూరగాయల వంటి పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం పారదర్శకంగా సర్వే నిర్వహించి.. రైతులకు పూర్తిగా ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దేశవ్యాప్తంగా రైతులంతా ఒక విడత రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారని, దీనిని కూడా పరిశీలించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ లంక గ్రామాల్లో వరదల కారణంగా కౌలు రైతులే ఎక్కువగా నష్టపోయారన్నారు. పెట్టిన పెట్టుబడితో పాటు కౌలుదారులు కౌలు కూడా చెల్లించి.. రెండు విధాలుగా నష్టాలను ఎదుర్కొన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటల నష్టపోయిన నిజమైన సాగుదారులు ఎవరో గుర్తించి వారికే నష్టపరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఈ–క్రాప్ నమోదు తో సంబంధం లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నమోదు చేసి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి నష్టపోయిన రైతులకు రెండో పంట వేసుకోవడానికి బ్యాంకుల్లో మరోమారు రుణాలు అందించి ప్రభుత్వమే ఉచితంగా విత్తనాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య, రైతుసంఘం నాయకులు బి.ఎల్.కె ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొనిగల సుబ్బారావు, మండల కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి మనోజ్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-పొదిలి

ప్రధానమంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ ఇండియా కార్యక్రమంలో ఎంపికైన మర్రిపూడి మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం కనిగిరి డిప్యూటీ ఈవో ఏ చంద్రమౌళేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని తరగతులు తిరిగి విద్యార్థులు నోట్స్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి జవాబులు రాబట్టారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి



- సరుకులు అందక పేదల ఇక్కట్లు
- దళారులకు నేరుగా విక్రయిస్తున్న ఎండియు ఆపరేటర్లు
- మామూళ్ల మత్తులో అధికారులు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పేద ప్రజలకు పిడికెడు అన్నం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు సబ్సిడీలు భరించి ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తున్నారు. ప్రతి నెలా జీతాలు చెల్లించి పేదలకు బియ్యం అందించాలని ఏర్పాటు చేసిన ఎండియు వాహన ఆపరేటర్లు లబ్ధిదారులకు మాయమాటలు చెప్పి అరకొర డబ్బులు ఇచ్చి రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా దళారులకు అందిస్తున్నారు. రేషన్ వాహనం మా బజారుకు రాలేదు, మాకు ఇవ్వటం లేదు అని అధికారులు, ప్రజా ప్రతినిధుల దష్టికి తీసుకువెళ్లినా కనీసం స్పందించకపోవడంతో ఆపరేటర్లు మరింతగా రెచ్చిపోతున్నారు. ఎవరూ మమ్మల్ని ఏమీ చేయలేరు అంటూ ఆపరేటర్లు కార్డుదారుల నుండి కొనుగోలు చేసి నేరుగా వారి వాహనాలలోనే దళారుల వద్దకు డోర్ డెలివరీ ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల పుల్లలచెరువు మండలం మొత్తం మీద అక్రమ రేషన్ బియ్యం దర్జాగా రాజమార్గాన సరఫరా చేస్తున్నట్టు సమాచారం అందుతోంది. మండలంలో అందరూ సిండికేట్‌గా ఏర్పడి కార్డుదారులకు అందించాల్సిన బియ్యం, పంచదార, కందిపప్పు వంటి సరుకులతో సహా అన్నింటిని అక్రమంగా కొనుగోలు చేసి పేద ప్రజలు కడుపు కొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతినెల ఎండియు ఆపరేటర్లపై బియ్యం సక్రమంగా అందించలేదని ఆరోపణలు వస్తున్నప్పటికీ అరికట్టాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల ముత్తులో పడి వారికి అండగా నిలబడటం అక్రమ వ్యాపారానికి మరింత బలం చేకూర్చినట్లు అవుతుంది. మండలంలో పాలు గ్రామాలలో ఇప్పటికీ రేషన్ బియ్యం ప్రజలకు అందలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. రేషన్ దుకాణాలు, ఎండియు వాహనాలను తనిఖీ చేయాల్సిన అధికారులు కనీసం సరుకులు పంపిణీ చేసే సమయంలో ఒక్కసారి అయినా వాహనాన్ని తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం



వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం

ప్రతి నిరుద్యోగికీ ఉపాధి కల్పనే లక్ష్యం

- టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు
- జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రతి నిరుద్యోగికి ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టిడిపి ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మంగళవారం యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మొదటి సంతకం మెగా డీఎస్సీ మీదే చేశారన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గానికి కూడా బహుళ జాతి కంపెనీలను రప్పించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పిస్తామన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉద్యోగాలు కల్పించేందుకు యువతకు అండగా నిలుస్తాని చెప్పారు. ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో ఈ నియోజకవర్గం నుంచి రెండుసార్లు మంత్రి అయినా కనీసం ఎస్సీ బాలుర వసతి గృహం అధ్వాన స్థితిలో ఉన్నా పట్టించుకోలేదని ఆరోపించారు. అయితే రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామితో మాట్లాడి ఎస్సీ బాలుర వసతి గృహం మరమ్మతులు, అదనపు భవనాల నిర్మాణం కోసం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు ఎరిక్షన బాబు తెలిపారు.

అలాగే ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో సౌకర్యాల కల్పనకు రూ.3.50 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. త్వరలోనే నిధులు మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ జాబ్‌మేళాలో హెట్రో కంపెనీ, ఇన్నోవ్ సోర్స్ కంపెనీ, పేటిఎం కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్న 325 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో 83 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డివో రవితేజ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాషా, ఎంప్లాయిమెంట్ అధికారి ఫిరోజ్, ఎంపిడివో వైవి నాగేశ్వర ప్రసాద్, ఎంఈవో ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్ విజయ భాస్కర్, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీధర్ నాయుడు, వైస్.ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ప్రదీప్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బి.విజయ కుమారి, టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు మంత్రు నాయక్, షేక్ మాబు, షేక్ మస్తాన్‌వలి, కామేపల్లి వెంకటేశ్వర్లు, వేగినాటి శ్రీను, కాకర్ల కోటయ్య, కంచర్ల సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు

స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌కు ఒంగోలు వైద్య కళాశాలకు చెందిన ఏడుగురు వైద్య విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్ (యుజిఎస్ఆర్ఎస్) ఎంపికైన ఏడుగురు ఎంబీబీఎస్ విద్యార్థులను వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.ఏడుకొండల రావు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రతి ఏటా ఈ స్కాలర్‌షిప్ కోసం పేపర్స్‌ను ఆహ్వానిస్తుందని, గోపాలుని తరలి నాగవల్లి (ఫైనలియర్ పార్ట్ 1), అతవ స్నేహ భార్గవి(ఎంబిబిఎస్ సెకండియర్) మలిశెట్టి సాయి దీపక్ (ఫైనలియర్ పార్ట్ 1), కొర్లగుంట వైష్ణవి (ఫైనలియర్ పార్ట్ 1), పడాల ధనుష్యశ్రీ (ఫైనలియర్ పార్ట్ 1), ఆషిమా (ఫైనలియర్ పార్ట్ 1), బోడ ఫణి సాయిశ్రీ (ఫైనలియర్ పార్ట్ 1) ఏడుగురు విద్యార్థులు ఎంపిక అయ్యారని తెలిపారు. మధుమేహం, సైకాలజీ, సర్జరీ వంటి విభాగాల్లో వీరు ఎంపిక అయ్యారని, రెండు నెలల పాటు వీరు ఆయా విభాగాల్లో పరిశోధన చేయాల్సి ఉంటుందన్నారు. ఫీల్డ్ పరిశోధనతో పాటు మందులు, ఇతర అంశాలపై కూలంకషంగా అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల కు చదువు తో పాటు పరిశోధన పట్ల ఆసక్తి, వారిలోని సృజనాత్మకతను వెలికతీసేందుకు ఈ స్కాలర్‌షిప్ ఉపకరిస్తుందన్నారు. స్కాలర్‌షిప్ సాధించిన వారికి, సహకరించిన ఫ్యాకల్టీ, ఇతర సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

ఇన్‌ఫెక్షన్స్ ఫ్రీ ఆసుపత్రిగా చేసేందుకు కృషి

- జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గా దేవి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఇన్‌ఫెక్షన్లు లేని ఆసుపత్రిగా చేసేందుకు కృషి చేయాలని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గా దేవి తెలిపారు. ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ప్రోగ్రామ్‌పై రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని వారు ప్రారంభించారు. డిఎంఇ ఆదేశాల మేరకు డాక్టర్స్, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ కల్యాణి, డా.తిరుమల రావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.దుర్గా దేవి మాట్లాడుతూ ఆసుపత్రి నుంచి సంపూర్ణ ఆరోగ్యంతో పేషెంట్ డిశ్చార్జ్ అవ్వాలని, ఇన్‌ఫెక్షన్ ఫ్రీ ఆసుపత్రి కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ఏడుకొండల రావు మాట్లాడుతూ ఆసుపత్రిలో బెడ్ షీట్ నుంచి నీడెల్ వరకు, అన్ని విషయాల్లో జాగ్రత్తలు అవసరమన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకరరావు మాట్లాడుతూ ఇన్ఫెక్షన్ బారిన పడటనికి అనేక రూపాలు ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ వెంకట దాస్

ప్రజాశక్తి - గిద్దలూరు

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ వెంకట దాసు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిషనర్‌గా నియమితులైన ఆయన ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి గిద్దలూరులోని పలు అంశాలపై చర్చించారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న కమిషనర్

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కంభం రూరల్

విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు మృతి చెందిన సంఘటన కంభం పట్టణంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. కంభం పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన దూదేకుల ఖలీల్ (30) శీలం వీధిలోని ఒక ఇంటిలో గ్రానైట్ బండలు పరుస్తున్నాడు. ఈ క్రమంలో ఎలక్ట్రానిక్ యంత్రానికి ఎర్త్ రావడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



మృతి చెందిన ఖలీల్

రాచర్లలో కొండచిలువ కలకలం

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలం గౌతవరం గ్రామ పొలాల్లో కొండచిలువను చూసి స్థానిక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా అటవీశాఖ రెస్క్యూ టీం వచ్చి కొండచిలువను సంచిలో బంధించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

మార్కాపురం: మార్కాపురం మండలంలోని కొండేపల్లి రోడ్డులో మంగళవారం రాత్రి కొండ చిలువ సంచారం కనిపించింది. వాహనదారులు రాకపోకలు సాగిస్తున్న సమయంలో రోడ్డు దాటు తున్న కొండచిలువను ప్రయాణికులు గమనించారు.



రోడ్డు దాటుతున్న కొండచిలువ

దేకనకొండలో గ్రూపుల మధ్య ఘర్షణ

- ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - కురిచేడు

పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన సంఘటన మండలంలోని దేకనకొండ గ్రామంలో జరిగింది. వివరాలలోకి వెళితే సోమవారం దేకనకొండ గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జరగడంతో ఆ గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. ఈ సందర్భంగా కురిచేడు పోలీసు సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి పరిస్థితులను అదుపు చేసి గాయాలపాలైన ఆరుగురిని చికిత్స కొరకు దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఘర్షణ వాతావరణాన్ని అదుపు చేయడానికి త్రిపురాంతకం సి.ఐ. యస్. సుబ్బారావు, దర్శి సి.ఐ. రామారావు, కురిచేడు యస్.ఐ. యం. శివ, దొనకొండ యస్.ఐ. విజయ్ కుమార్ ఆ గ్రామంలో ఉండి ఉద్రిక్తత వాతావరణం తలెత్తకుండా పరిస్థితిని చక్కదిద్దారు. పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసి మరలా ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలంలోని నాయుడుపాలెం, చాపలమడుగు, సి.కొత్తపల్లి గ్రామాల్లో సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆన్‌లైన్‌లో జరిగే మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సార్డ్స్ పిఎం మహాలక్ష్మి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో జరిగే మోసాల్లో ఎక్కువగా ఫోన్ పే, గూగుల్ పే, ఆధార్ కార్డు ఓటిపి ద్వారా జరుగుతాయన్నారు. అంతేకాకుండా బాల బాలికలు ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకొని మోసపోతున్నారని చెప్పారు. అలాగే ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ఎక్కువగా మోసపోతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని ఫోన్ నెంబర్ల ద్వారా ఫోన్ కాల్స్ వచ్చి ఏదైనా సమాచారం అడిగితే చెప్పకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఅండ్ఈ శశి, సిఎఫ్‌సి ధర్మా నాయక్ పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - మార్కాపురం

మార్కాపురం పట్టణ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు మంగళవారం సాయంత్రం అరెస్టు చేశారు. వీరి వద్ద నుండి రూ. 2,540 నగదు, నాలుగు మోటర్ బైకులు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

రేపల్లె మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు

ప్రజాశక్తి-రేపల్లె

భారీ వర్షాలు, వరదల కారణంగా గత పది రోజుల నుంచి రేపల్లె పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్యం క్షీణించడంతో నూతనంగా రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కాకర్ల సాంబశివరావు మంగళ వారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. పారిశుధ్యం క్షీణించిన చోట యుద్ధ ప్రాతిపదికన శానిటరీ వర్కర్లతో పారిశుధ్య పనులను వేగవంతం చేశారు. పట్టణంలోని 28 వార్డుల్లో డ్రైనేజీలోని పూడికలను తొలగించి, చెత్తగుట్టలను ప్రొక్లెయిన్ల ద్వారా ట్రాక్టర్లపై ఎత్తించి ఆపై అన్ని వార్డుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర పర్యవేక్షణలో బ్లీచింగ్, సున్నం చల్లించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. అలాగే పట్టణంలోని పెద్ద కూరగాయల మార్కెట్, ఫ్రూట్ మార్కెట్‌లలో వచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు ట్రాక్టర్లపై డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రక్షిత నీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి పైపులైన్ల లీకులను పరిశీలించి తక్షణమే మరమ్మతు పనులను వేగవంతం చేయాలని సంబంధిత



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని ప్రతి కుటుంబం రక్షిత మంచినీటి పథకం పైపుల ద్వారా సరఫరా చేస్తున్న నీరు భారీ వర్షాలు, వరదలకు కలుషితమైందని, కాబట్టి ఈ నీటిని కాచి చల్లార్చి ఆ నీటిని తాగాలని కమిషనర్ పుర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులు, వీధి కుక్కలు, ఆవుల బెడదను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఆయన వివరించారు. రేపల్లె పురపాలక సంఘంలో పనిచేస్తున్న శానిటరీ వర్కర్లు, సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, వారికి అప్పగించిన పనులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పనులను వేగవంతం చేయాలన్నారు. పురపాలక సంఘ పరిధిలో గృహాలు నిర్మిస్తున్న యజమానులు రేపల్లె మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ అధికారుల వద్ద నుంచి హౌస్ ప్లానింగ్ తీసుకోవాలని, ఎలాంటి టౌన్ ప్లానింగ్ లేకుండా గృహాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రేపల్లె పురపాలక సంఘంలో ఉన్న గృహాలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపారస్తులు, సకాలంలో ఇంటి పన్ను, షాపు పన్ను, మంచినీటి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి పాటు పడాలన్నారు. రేపల్లె నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ స్టాంపుల రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రేపల్లె పురపాలక సంఘ చైర్ పర్సన్ కట్ట మంగ, రేపల్లె మున్సిపల్ కోఆప్షన్, కౌన్సిల్ సభ్యుల సహకారంతో పల్లె పట్టణ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చక్రాయపాలెంలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-అద్దంకి

మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఈ సర్వేలో ముగ్గురు మాత్రమే సాధారణ జ్వరంతో ఉన్నారని తెలిసింది. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఎబెట్ స్ప్రే చేయించడం, గ్రామం మొత్తం బ్లీచింగ్ చల్లించారు. గ్రామంలో రోడ్ల వెంబడి, పబ్లిక్ స్థలాల్లో ఎరువు దిబ్బలు వేసిన వారు తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి దేవసేనకుమారి, గ్రామ సర్పంచ్ గోగులముడి నగేష్, మెడికల్ ఆఫీసర్ శ్రీహర్ష, ఎంపీహెచ్ఓ నాగేశ్వరరావు, మెడికల్ సూపర్‌వైజర్ సత్తార్, మెడికల్ మేల్ అసిస్టెంట్స్ కరీముల్లా, మరియు నాగమోహన్, ఎంఎల్ హెచ్‌పి విజయ, ఏఎన్ఎం పార్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సమతుల్య ఆహారంపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సుభద్రాదేవి

సమతుల్య పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-పర్చూరు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య పౌష్టికాహారం అందించాలని సిడిపిఓ సుభద్రాదేవి అన్నారు. అప్పుడే ఆరోగ్య వంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. మండలంలోని వీరన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళ వారం జరిగిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. సమతుల్య ఆహారానికి సంబంధించి వంటావార్పు చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. పౌష్టికాహారం గురించి ప్రదర్శన నిర్వహించి అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చెరుకూరు సెక్టార్ సూపర్‌వైజర్ రాధ, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న డిప్యూటీ శ్రీనివాసరావు

డ్రాపవుట్ విద్యార్థులను గుర్తించాలి

ప్రజాశక్తి-చీరాల: డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేయించేలా వారిని ప్రోత్సహించాలని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి అబ్బురాజు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి మండలంలోని ఈపురుపాలెం జిల్లా పరిషత్తు బాలిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. ముందుగా స్కూలు ఆవరణంలోనే సావిత్రిబాయి పూలే విగ్రహానికి ఉపాధ్యాయు లతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కారంచేడు ఎంఈఓ-2 ఎం వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు జి శ్రీనివాసరావు, రత్నకుమారి, శ్రీనివాసరావు, సుబ్బారావు పూర్ణచంద్రరావు, కుర్రా రామారావు, బి వెంకటేశ్వరరావు, జిటిఎ జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె రూరల్ మండలం బొబ్బర్లంక గ్రామంలో వరద ముంపునకు గురయిన 72 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. (విఆర్వో) విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్- గ్రామ పునర్నిర్మాణ సంస్థ ఆపరేషన్ డైరెక్టర్ ఫాదర్ వేళాంగిణి రాజు ఎస్‌జె, అసోసియేట్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్ ఎస్‌జె సహాయ సహకారాలతో నిత్యావసర సరుకులు అందజేశామని అనగాని శివప్రసాద్ తెలిపారు. అనగాని శివప్రసాద్ ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, 3 కేజీలు కందిపప్పు, 2 ప్యాకెట్ల నూనె, 2 కేజీల పచ్చళ్లు, 2 శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. అలాగే లంకెవానిదిబ్బ గ్రామంలో అసిస్ట్ సంస్థ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో కేఎన్‌ఎ ఫౌండేషన్ హైదరాబాద్ వారు సునీత, గుడ్డు హారన్ రామచంద్రన్, ఆశ, పూర్ణిమ, సింగరాజు వారి సహకారంతో నిత్యవసర సరుకులు అందించమని శివప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సంస్థ వారు, కేఎన్‌ఎ ఫౌండేషన్ హైదరాబాద్, పంతాని మురళీధరరావు, తాత ఏడుకొండలు, కోపనాతి రాజశేఖర్, కేసన రామకృష్ణ, బొబ్బర్లంక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శాస్త్రీయ విద్యా విధానంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-చీరాల

శాస్త్రీయ విద్యా విధానం ద్వారా మాత్రమే సమాజం అభివృద్ధి చెందుతుందని విశ్వమానవ సంక్షేమ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ మస్తాన్‌రావు అన్నారు. సోమవారం చీరాల మండలం ఓడరేవులో డివైఎఫ్ఐ, విశ్వమానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో యువకులుగా ముందుకువచ్చి ఉచిత ట్యూషన్ సెంటర్ నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి శాస్త్రీయ విద్యా విద్యావిధానం, ప్రశ్నించేతత్వం అలవరుచుకోవాలని అన్నారు. విద్యార్థులతో పాటు మహనీయులు, జాతీయోద్యమ నాయకల చరిత్ర నుంచి మంచి విలువలను నేర్చుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులు మంచి విలువలను పెంపొందించుకోవడం ద్వారా మంచి సమాజం నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఈ స్ఫూర్తితోనే విశ్వమానవ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యాపితంగా ట్యూషన్ సెంటర్‌లను నిర్వహిస్తోందని అన్నారు. సిఐటియు నాయకులు ఎన్ బాబురావు మాట్లడుతూ విద్యార్థులు కుటుంబ సమస్యల కారణంగా విద్యకు దూరం కాకుండా ఉండేందుకు, విద్యార్థులలో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు ఈ ట్యూషన్ సెంటర్ ఉపయోగపడాలని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ అధ్యక్షులు గంగిరి ఏసుబాబు, ట్యూషన్ టీచర్ గంగిరి మౌనిక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకుడు బాబురావు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ఎంపీడీవో రామాంజనేయులు

ప్రజాశక్తి-పంగులూరు

ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థులు కూడా క్రమశిక్షణతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీవో బి రామాంజనేయులు కోరారు. మంగళవారం పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ విద్యా కమిటీ చైర్మన్‌లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు వారంలో రెండు రోజులపాటు ఐఎంఎస్ యాప్‌లో టాయిలెట్స్‌ను ఫొటోలు తీసి పంపాలన్నారు. మధ్యాహ్న భోజనం మానిటరింగ్ చేసి విద్యార్థులకు రుచికరమైన భోజనం అందే విధంగా చూడాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన మండల విద్యాశాఖ అధికారి జి వీరాంజనేయులు మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థుల ఫైనల్ ఎగ్జామ్స్ కోసం ప్రతి పాఠశాలలో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. అకాడమిక్ క్యాలెండర్ ను కూడా పక్కాగా అమలు పరచాలని అన్నారు. పాఠశాలను వదిలిన విద్యార్థులను ఓపెన్ స్కూల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్లు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామాంజనేయులు



నూకసాని బాలాజీకి శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

నూకసానికి జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పొదిలి

తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఒంగోలులోని ఆయన కార్యాలయంలో పలువురు పొదిలికి చెందిన టిడిపి నాయకులు పూల మాలలు వేసి శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నూకసాని బాలాజీని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో పొదిలి మాజీ సర్పంచ్ స్వర్ణ గీత, అడ్వకేట్ స్వర్ణ వెంకటేశ్వర్లు దంపతులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, రాష్ట్ర టిడిపి బీసీ సంఘం ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేష్ యాదవ్, టిడిపి నాయకులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శామంతపూడి నాగేశ్వరరావు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ఆవులూరి యల్లమంద, తానికొండ వెంకటరావు, ఎస్‌కె రసూల్, ముని శ్రీను, తలమళ వెంకటరావు, కల్లూరి సోమయ్య, జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పప్పు గౌస్‌లు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.



నియామక పత్రం అందజేస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

కారుణ్య నియామకంలో ఉద్యోగం

నియామక పత్రం అందజేసిన ఏఎస్పీ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుమారునికి కారుణ్య నియామకంలో ఉద్యోగం కల్పిస్తూ నియామక పత్రాన్ని ఏఎస్పి కె.నాగేశ్వరరావు అందజేశారు. జిల్లాలోని పోలీస్ శాఖ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బి.సుబ్బారావు 2023 నవంబర్ 8న అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఆయన కుమారుడు బి.క్రాంతికుమార్ కి కారుణ్య నియామకంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో క్రాంతికుమార్‌కు ఎఎస్‌పి(అడ్మిన్) కె.నాగేశ్వరరావు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అంకితభావంతో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించడం బాధాకరమన్నారు. వారికి ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చని, పోలీసు శాఖ వారి కుటుంబసభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. క్రమశిక్షణ, అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, వత్తి నైపుణ్యం పెంచుకొని అప్పగించిన విధులను సమర్థవంతంగా చేస్తూ అధికారుల మన్ననలు పొందాలని క్రాంతికుమార్‌కు ఏఎస్పి సూచించారు.

మినీ జాబ్‌మేళాలో 33 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మార్కాపురం

'స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్' ఆధ్వర్యంలో మార్కాపురంలో మినీ జాబ్‌మేళా మార్కాపురంలోని నాక్ సెంటర్‌లో మంగళవారం జరిగింది. ఈ మేళాలో 132 మంది నిరుద్యోగులు పాల్గొనగా అందులో 33 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పేటిఎం, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌తో పాటు కెఎల్ కంపెనీలో ఫీల్డ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులతో పాటు బ్యాంకింగ్, అమెజాన్, సెక్టార్లలో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేసేందుకు ఐటిఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన వారికి ఇంటర్వ్యూ ద్వారా అవకాశం కల్పించారు. 68 మంది రెండవ రౌండ్‌లో ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు రూ. 14500 నుండి రూ.21 వేలకు పైగా జీతం ఉంటుందని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ టి.చందన, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి జె.రాజారావు, యంగ్ ప్రొఫిషినల్ డి.రమేష్, వినోద్, స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ కోఆర్డినేటర్ ఫిరోజ్ పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ సమీక్షలో ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జాతీయ గ్రామీణ తాగునీరు (జల్ జీవన్ మిషన్) అంశంపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిటీ సభ్యులు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. మంగళవారం ఢిల్లీలోని పార్లమెంట్ హాలులో ప్రజా పద్దుల కమిటీ(పిఎసి) ఛైర్మన్ కెసి వేణుగోపాల్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట పర్యటన

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మంగళవారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. రాత్రి 7 గంటలకు ఒంగోలు గాంధీ రోడ్డులో ఇందిరా గాంధీ బొమ్మ వద్ద స్వర్ణకారుల అసోసియేషన్, గాంధీ రోడ్డులో రాముల వారి గుడి వద్ద గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్, కోర్టు సెంటర్‌లో మున్సిపల్ కార్పొరేటర్ టి. రవితేజ ఏర్పాటు చేసిన, రాజా పానగల్ రోడ్డులో తూము సుబ్బారావు, కొణిజేడు బస్టాండ్‌లో దండే అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొంటారు.

కుల నిర్మూలన ద్వారానే దేశాభివృద్ధి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు 'నల్లప్ప'



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప

ప్రజాశక్తి-మార్కాపురం

దేశాభివృద్ధికి... కులాల మధ్య అంతరం ముడిపడి ఉందని, కుల నిర్మూలన ద్వారానే దేశాభివృద్ధి త్వరగా జరుగుతుందని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప పేర్కొన్నారు. కెవిపిఎస్ జిల్లా శిక్షణా తరగతులు మార్కాపురంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందుగా ఆత్మ గౌరవం, సమానత్వం, కులనిర్మూలన లక్ష్యాలతో కూడిన నీలి రంగు పతకాన్ని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జవ్వాజి రాజు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా నల్లప్ప మాట్లాడుతూ కుల నిర్మూలన జరిగితేనే దేశం అభివద్ధి చెందుతుందని, బిజెపి పాలనలో రాజ్యాంగం పెనుప్రమాదంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు కులాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. అంటరానితనానికి, అణచివేతకు, కులవివక్ష వ్యతిరేకంగా పోరాడే సంఘం కెవిపిఎస్ అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కులవివక్ష రూపాలను బహిరంగపరచి ప్రభుత్వాలను కదిలించిన ఘనత కెవిపిఎస్‌కు ఉందని కొనియాడారు. దళితులను ఐక్యం చేస్తూ పోరాటాలు చెయ్యడం అభినందనీయం అన్నారు. వర్గీకరణ అంశంపై అనుకూల, ప్రతికూల వాదనలు మాట్లాడే వారు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు దళితులను, రిజర్వేషన్‌లను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ఏనాడూ వీళ్ల నోరు మెదపడం లేదని మండిపడ్డారు. కులాంతర వివాహాలు ప్రోత్సహించాలని, చేసుకున్న వారికి ప్రభుత్వమే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ నాయకులు జాలా అంజయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై రోజురోజుకీ అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని బలహీనపర్చి పూర్తిగా నీరుగార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ, రిజర్వేషన్‌లను తీసేయాలని బిజెపి చూస్తోందని విమర్శించారు. దేశంలో రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, రాజాంగాన్ని కాపాడుకోవసిన బాధ్యత మనందరిపై ఉందని హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా నేటికీ దళితులు అభివద్ధికి, నేటికీ విద్య, వైద్యం సదుపాయాలకు దూరంగా ఉన్నారని అన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు డి.సోమయ్య, డి.కె.ఎం.రఫి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుమ్మా బాల నాగయ్య, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జేసురత్నం, జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్, జి.విక్టర్, కె.నరేష్ కత్తి యోబు పాల్గొన్నారు.

రవాణా రంగ సమస్యలపై

ధర్నాను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు పిలుపు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రవాణా రంగ సమస్యలైన ఈ- చలానాల రద్దు, పర్మినెంట్ స్టాండ్, శాశ్వత అనుతి కోసం ఈ నెల 13న మండల కేంద్రాలు, 17వ తేదీ ఒం గోలు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఒంగోలు నగర ఆటో యూనియన్ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి షేక్ హుస్సేన్ బాషా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ రవాణా కార్మిక సమస్యలపై ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. నగర ఆటో యూనియన్ కార్యదర్శి తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలు నగరం పది ప్రాంతాల్లో పర్మినెంట్ స్టాండ్లు ఏర్పాటు చేయాలని, శాశ్వత అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం జరిగే ధర్నాలలో ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆటో నాయకులు పాల్గొన్నారు.

భూస్వామ్య దోపిడీపై పోరాడిన

వీరనారి ఐలమ్మ

జిల్లా రజక వృత్తిదారుల సంఘం నివాళి



మాట్లాడుతున్న టంగుటూరి రాము

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భూస్వామ్య దోపిడీని ఎదిరించి పోరాడిన వీర నారి చిట్యాల ఐలమ్మ అని జిల్లా రజక వృత్తిదారుల సంఘ నాయకులు తెలిపారు. ఒంగోలు ఎల్‌బిజి భవన్ లో భవనం చిట్యాల ఐలమ్మ (చాకలి) 39వ వర్ధంతి, విద్యుత్ ఉద్యమంలో అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సభ టంగుటూరి రాము అధ్యక్షతన మంగళవారం జరిగింది. తొలుత చాకలి ఐలమ్మ, రామకష్ణ చిత్రపటాలకు సంఘం నాయకులు డాక్టర్ కష్ణయ్య, యోగమ్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు టంగుటూరి రాము మాట్లాడుతూ చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం రాజీలేని పోరాటం చేశారన్నారు. జిల్లా చేతివత్తిదారుల సంఘం నాయకులు ఎస్‌కె మాబు మాట్లాడుతూ విద్యుత్ ధరలు ప్రజలపై భారాలు మోపి 2000 సంవత్సరంలో ధరలు తగ్గించాలని అనేక నిరసన కార్యక్రమాలు చేస్తున్న క్రమంలో హైదరాబాద్ బషీర్‌బాగ్ సెంటర్ లో నిరసన సందర్భంలో కాల్పుల్లో బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్తెనపల్లి రామకష్ణ పోలీసుల తూటాలకు బలై అమరులయ్యారన్నారు. వత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి తోటా తిరుపతిరావు మాట్లాడుతూ అమరులైన ఐలమ్మ, రామకృష్ణ వంటి పోరాట యోధుల మార్గంలో నడవాలని, అలాంటి పోరాటాలు చేసి సమస్యలను సాధించుకోవాలన్నారు. జిల్లా రజక వత్తిదారుల సంఘం కార్యదర్శి రాయల మాలకొండయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు ఆవులమంద రమణమ్మ, సిహెచ్ కోటేశ్వరరావు, చిట్యాల కొండయ్య, మంచికలపాటి శ్రీనివాసరావు, పోలయ్య, వేములపాటి మల్లికార్జున, పొదిలి మల్లికార్జున, కల్లగుంట శ్రీనివాసులు, సంజీవయ్య పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పన్నులు చెల్లించాలి: కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి అర్ధ సంవత్సరం ఈ నెల 30తో ముగుస్తున్నందున నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించాల్సిన వారు సకాలంలో చెల్లించాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు కోరారు. కార్పొరేషన్ రెవిన్యూ సిబ్బందితో మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్ల మీద చర్చించారు. పన్నుల బకాయిలు చెల్లించనివారికి రెడ్ నోటీసు జారీ చేసి వారి కులాయి కనెక్షన్‌లు నిలుపుదల చేయాలని సూచించారు.



బందిలదొడ్డికి తరలించిన ఆవులు

రోడ్లపై తిరిగే ఆవులు తరలింపు..

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలోని రోడ్లమీద తిరుగుతూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 52 ఆవులను నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం సిబ్బంది అదుపులోకి తీసుకొని మంగళవారం స్థానిక సంతపేటలోకి బందిల దొడ్డికి తరలించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆవులకు సంబంధించిన యజమానులు ఎవరైనా ఉంటే రూ.వెయ్యి జరిమానా చెల్లించి వారి ఆవులను వారు తీసుకువెళ్లాలని సూచించారు. ఆవుల యజమానులు వారి ఆవులను రోడ్ల మీదకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ పాండురంగారావు, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, టిపిఓ సాంబశివరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న డ్యాన్స్ పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



డ్యాన్స్ వేస్తున్న చిన్నారులు

ఒంగోలు జూనియర్ ఛాంబర్ వారోత్సవాలు స్థానిక కాపు కళ్యాణ మండపంలో మంగళవారం కూడా కొనసాగాయి. వారోత్సవాల ప్రారంభం సందర్భంగా స్కూల్ స్థాయి విద్యార్థులకి వెస్టర్న్ డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ముందుగా వివిధ రంగాల్లో సేవ చేసిన వయోవద్ధులను, ఒంగోలు జూనియర్ ఛాంబర్ ప్రారంభించిన పెద్దలను సన్మానించారు. అవ్వాతాతలతో ఆటాపాటా కార్యక్రమాన్ని త్రోవగుంటలో కాకతీయ వద్ధాశ్రమంలో రిటైర్డు డిప్యూటీ తహశీల్దార్ ఏస్ డీ.ఇస్మాయిల్ నిర్వహించారు. గెలుపొందిన వారికి జూనియర్ ఛాంబర్ అధ్యక్షులు కె.వరుణ్, వారోత్సవాల చైర్మన్ శబరీనాయర్ బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా సిఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ జెసిఐ సేవాకార్యక్రమాలు యువతకు ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. వెస్టర్న్ డ్యాన్స్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కొరియోగ్రాఫర్ బాలాజీ, పిన్ఎం నగర కార్యదర్శి ఇంద్రజ్యోతి వ్యవహరించారు. కార్యక్రమంలో అతిథులు సరస్వతి విద్యాసంస్థలు అధినేత ఏ వి రమణారెడ్డి, జూనియర్ ఛాంబర్ జాతీయ పూర్వ అధ్యక్షులు పిపిపి నయనాల రామకృష్ణ, విజేతా రమణ, బొమ్మల శ్రీను, ఎం.శేఖర్ బాబు, కసిబిసి నాగేశ్వరరావు, జూనియర్ ఛాంబర్ వారోత్సవాల కార్యదర్శి సాత్విక్ రాజ్, కో చైర్మన్స్ కె.శివ కోటిరెడ్డి, గంధవల్ల బాలకృష్ణ పాల్గొన్నారు.



సడ్డీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- పిసిపల్లి

మండల పరిధిలోని నేరేడుపల్లి జడ్‌పి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విశ్రాంత ఎంఇఒ ద్వారాశీల రవీంద్ర ప్రసాద్ రెడ్డి, ఆయన కుమారుడు చక్రధర్, సోదరుడు ప్రసాద్ రెడ్డి మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు స్డడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంఇఒ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్య వినయం, వివేకం అవసరమన్నారు. ఈ మూడు ఉన్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. చక్రధర్ మాట్లాడుతూ ఇంగ్లీష్ భాష పై పట్టు ఉంటే విదేశాలలో రాణించవచ్చునని తెలిపారు. అనంతరం విద్యార్థులకు మెటీరియల్ అందజేసిన దాతలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. అంజనీదేవి, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రానికి పైడిపాడు, గోగినేనివారి పాలెం,అక్కచెరువుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,392 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,302 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 90బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.358, అత్యల్ప ధర రూ.190, సరాసరి ధర కిలో రూ.313.43 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. వేలంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

దుస్తుల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం లక్కవరం ఎస్‌సి కాలనీలో దుస్తుల తయారీపై శిక్షణను నైపుణ్య అభివద్ధి మరియు ఔత్సాహిక మంత్రిత్వశాఖ వారి ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థాన్ సారధ్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జన శిక్షణ సంస్థాన్, ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్యాం సునీల్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో మహిళలు తప్పకుండా ఏదో ఒ వత్తి శిక్షణలో నైపుణ్యం పెంచుకొని తద్వారా స్వయం ఉపాధి పొందవచ్చునని తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ జన శిక్షణ సంస్థాన్ మహిళలకు, గహిణిలకు వివిధ రకాల వత్తి,విద్యలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కవరం గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి కోమలి, శిక్షకురాలు టి.నాగ లక్ష్మిపాల్గొన్నారు.

ఆర్ఒ ప్లాంట్‌లో పరిశీలన

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరులోనున్న ఆర్ఒ ప్లాంట్‌ను ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ చెన్నకేశవులు , ఎఇ వెంకటేశ్వర్లు మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వాటర్ స్టోరేజ్ ప్లాస్టిక్ కంటైనర్‌లో నిల్వ చేశారు. వెంటనే ప్లాస్టిక్ కంటైనర్‌ను తొలగించి స్టీల్‌ది ఏర్పాటు చేయాలన్నారు. పిల్టరైన నీటి ట్యాంకుపై ఎలాంటి కప్పు లేదని, దీని వల్ల నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురైయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ఓవర్ హెడ్ ద్వారా కుళాయిలకు అందించే ఫిల్టర్ బెడ్స్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి పెంట్యాల శ్రీను ,వార్డు మెంబర్లు కనగాల శ్రీనివాసరావు, అత్తంటి కోటి , ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి బెనహర్, టిడిపి జనసేన నాయకులు పెంట్యాల కోటేశ్వర రావు, పెంట్యాల శ్రీనివాసరావు, తెలగతోటి జాన్సన్,ఎన్? వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముసికి సాగర్ నీరు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కొండపి

వర్షాలు లేక వరి నాట్లు వేసేందుకు అవకాశం లేక నీళ్ల కోసం ఎదురు చూస్తున్న ముసి ప్రాంత రైతుల కోసం తక్షణమే సాగర్ నీరు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు సకాలంలో కురిస్తే ఈపాటికే కొండపి, టంగుటూరు మండలాల్లో సుమారు 1500 ఎకరాల్లో వరి నాట్లకు రైతులు సిద్ధం అయ్యేవారని తెలిపారు. సహజ సిద్ధంగా ముసికొచ్చే నీరు రానందున వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం కాలేదని తెలిపారు. ఈ స్థితిలో ప్రబుత్వం ముసికి సాగర్ నీరున విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముసికి సాగర్ నీరు వదిలితే ముసి పరివాహక ప్రాంతంలోని నాలుగు మండలాలలోని 46 గ్రామాలకు సాగునీరు, తాగునీరు లభించే అవకాశం ఉందన్నారు. తాళ్లూరు మండలంలోని వెలుగువారిపాలెం, బొద్ది కూరపాడు, చీమకుర్తి ,కొండపి



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

టంగుటూరు మండలాల్లో అనేక గ్రామాల ప్రజలకు ఈ నీరు ఉపయోగపడుతుందన్నారు. గతంలో కూడా వర్షాలు కురవక రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నటువంటి పరిస్థితుల్లో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పక్షాలు కలిసి చేసిన ఉద్యమ ఫలితంగా ప్రభుత్వాలు కదిలి ముసికి సాగర్ నీరు ఇచ్చిన పరిస్థితి ఉందని గుర్తు చేశారు. నిత్యం ఈ ప్రాంతంలో కరువు సంభవిస్తున్నదని దీనిని గమనంలో ఉంచుకొని ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన ముసికి ఐదు టిఎంసిల సాగర్ నీరు విడుదల చేసే విధంగా నిర్ణయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓ వైపు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు దాదాపు పూర్తిగా నిండినట్లు తెలిపారు. వందల టిఎంసిల నీరు వథాగా సముద్రంలో కలుస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలతో జలమయమై ఉండగా ఈ ప్రాంతంలో కనీసం తాగునీరుకు కూడా ప్రజలు ఇబ్బంది పడటం విచారకరమని ఆయన తెలిపారు. తక్షణమే జిల్లాకు చెందిన మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముసికి సాగర్ నీరు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కెజి. మస్తాన్ పాల్గొన్నారు.

చేపలు పట్టుకునేందుకు చెరువులోని ..

నీటిని వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పామూరు

చేపలు పట్టుకునేందుకు చెరువులోని నీటి వృథాగా బయటకు వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. సిపిఎం బృందం మండల పరిధిలోని మోపాడు చెరువును మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ మోపాడు చెరువులో నీరు ఉంటే భూగర్భజలం అందుబాటులో ఉంటుందన్నారు.వైసిపి ప్రభుత్వ హయాంలో ఓ సారి చేపలు పట్కుఉనేందుకు చెరువులోని నీటి ఓ సారి బయటకు వదిలినట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో న్యాయం జరుగుతుందని రైతులు బావించినట్లు తెలిపారు. అయితే టిడిపి ప్రభుత్వం కూడా వైసిపి అడుగుజాడల్లో నడుస్తుందని ఆరోపించారు. చేపలు పట్టుకునేందుకు చెరువులోని నీటి



చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

బటకు వదులుతున్నట్లు తెలిపారు. చెరువులోని నీటిని వ్యవసాయ భూములపై వదిలివేయడంతో రైతులకు ఇబ్బందిగా ఉందని ఆరోపించారు. చేపల కోసం నీటిని వదలటం రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. చెరువులోని నీలిని బయటకు వదులుతున్న సమయంలో సంబంధిత అధికారులు కనిపించకపోవడం దురదష్టకరమని ఆరోపించారు. వర్షాలు లేక నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో చేపల వ్యాపారులు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని వృథాగా బయటకు వదిలివేస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటి ప్రజలకు నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి నీటిని వథాను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువును పరిశీలించిన వారిలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కె. శంకర్, సయ్యద్ గౌస్ బాషా, చల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐ ఖాజావలి

కనిగిరికి చేరిన 'ఆర్మీ' సైకిల్ యాత్ర

ప్రజాశక్తి -కనిగిరి

టెరిటోరియల్ ఆర్మీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జవాన్లు చేపట్టిన ఆర్మీ సైకిల్ యాత్ర మంగళవారం కనిగిరికి చేరింది. కశ్మీర్ లోని సియాచిన్ నుంచి అండమాన్ నికోబార్ దీవుల్లోని ఇందిరా పాయింట్ వరకూ చేపడుతున్న సైకిల్ యాత్ర కనిగిరికి చేరిన సందర్భంగా అమరావతి గ్రౌండ్స్ నుంచి సైకిళ్లపై జాతీయ జండాలు చేతబట్టి ర్యాలీగా కూటమి శ్రేణులతో కలిసి ప్రభుత్వ హై స్కూల్ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజ్ విద్యార్థులు జవాన్లకు ఘన స్వాగతం పలికారు. చర్చి సెంటర్ నుంచి జూనియర్ కాలేజ్ వరకూ విద్యార్థులు 400 అడుగుల భారీ జాతీయ జండాతో స్వాగతం పలికారు. ప్రజలు, దేశభద్రతే లక్ష్యంగా ఆర్మీ కషి చేస్తుందని విద్యార్థులకు ఆర్మీ మేజర్లు అవగాహన కల్పించారు.. కనిగిరికి చేరే సరికి యాత్ర 3269 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. ఈయాత్ర 5,500 కిలోమీటర్ల మేర చేపట్టనున్నారు. ఈ యాత్రలో మేజర్లు, సిపాయిలు, కనిగిరి సిఐ షేక్ ఖాజావలి, ఎస్ఐ త్యాగరాజు, ఎన్‌సిసి స్టూడెంట్స్, విద్యార్థులు, ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఐ నాయకుడు పట్రా పాల్ మృతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు పట్రా పౌలు (85) అనారోగ్యంతో మతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మతి చెందారు. మతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పౌలు భౌతిక కాయాన్ని సిపిఐ నాయకులు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. పౌలు కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి, అనేక పోరాటాలు, ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని సిపిఐ మార్కాపురం నియోజకవర్గ కార్యదర్శి అందే నాసరయ్య తెలిపారు. ఆయన మతి పార్టీకి తీరని లోటన్నారు. పౌలుకు మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపిటిసి పిల్లి లక్ష్మీనరసయ్య, సిపిఐ నాయకులు పివి.కొండయ్య, సిగినం వెంకటేశ్వర్లు ,చేబ్రోలు సిద్దయ్య, పి.పిచ్చయ్య, సురవరపు వెలుగొండరెడ్డి, పి.బాలనరసయ్య తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు విద్యుత్ ఉద్యోగుల విరాళం

ప్రజాశక్తి-అద్దంకి

వరద బాధితుల కోసం విద్యుత్ శాఖ ఉద్యోగులు భారీ విరాళాన్ని ప్రకటించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ నేతృత్వంలో విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఒకరోజు జీతాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తం రూ.10,61,81,614లను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకోవడానికి విద్యుత్ ఉద్యోగులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వారి ఒకరోజు జీతాన్ని రూ.10,61,81,614 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. గత పది రోజులుగా విజయవాడ నగరంలో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఎంతో ముందుచూపుతో వ్యవహరిస్తూ బాధితులకు అండగా నిలబడుతూ ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడారని అన్నారు. 70 ఏళ్లకు పైబడినా కూడా సీఎం రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి అందిస్తున్న సేవలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులు కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో పని చేస్తూ తమ సేవలు అందిస్తున్నారని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు సమిష్టి కృషి కారణంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో సుమారు 3.5లక్షల విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ మాట్లాడుతూ... విద్యుత్ శాఖ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు కూడా ముందుంటుందని తెలిపారు. విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు కూడా ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పని చేస్తారని అన్నారు. ఇప్పుడు కూడా వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సీపీడీసీఎల్ సీఎండీ పట్టాన్ శెట్టి రవి సుభాష్, విద్యుత్ ఇంజనీర్ల అసోసియేషన్ ప్రతినిధులు, విద్యుత్ ఉద్యోగుల ఐకాస ప్రతినిధులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కొల్లూరు

ముంపునకు గురైన చింతల్ లంక, పెదలంక గ్రామాల్లో మంగళవారం హార్వెస్ట్ ఇండియా సంస్థ లంక గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు వేమూరు శాసనసభ్యులు నక్క ఆనందబాబు చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నక్క ఆనందబాబు మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలోని రైతులు నష్టపోయారు. వరద ముంపు నుంచి ఇంకా పొలాలు బయట పడలేదు. ప్రభుత్వం తరపున వారికి అండగా ఉంటామని ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన అన్నారు. హార్వెస్ట్ ఇండియా సంస్థ ద్వారా స్వచ్ఛందంగా ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమని ఆయన అన్నారు. జెడ్పి చైర్మన్ క్రిస్టినా మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సంభవించి నప్పుడు హార్వెస్ట్



సాయం అందిస్తున్న ఎమ్మెల్యే నక్క ఆనంద్‌బాబు

ఇండియా తరపున చాలా చోట్ల ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో హార్వెస్ట్ ఇండియా సంస్థ డైరెక్టర్ కత్తెర సురేష్ కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, కొల్లూరు మండలంలోని తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సేవకుడు కనకయ్య

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-పర్చూరు

కామ్రేడ్ కృష్ణంశెట్టి కనకయ్య గొప్ప ప్రజా సేవకుడని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన పేదల పక్షాన నిలబడి చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో కనకయ్య 9వ సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. లక్ష్మీపురంలోని కనకయ్య స్థూపం వద్ద, బాలికోన్నత పాఠశాల్లోని కనకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ కనకయ్యతో గల సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పర్చూరు ప్రాంతీయ విద్యా అభివృద్ధి మండలిని నెలకొల్పి అనేకమంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాదానం చేశారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయన సతీమణి కృష్ణంశెట్టి పార్వతి, కుమారుడు అజయ్‌బాబు, ఏపి సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు ఉప్పుటూరి మురళీకృష్ణ, రంగస్థల నటులు కారుమూరి సీతారామయ్య, శారదా స్కూల్ డైరెక్టర్ కృష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, షేక్ అహమద్ బాషా, కొల్లా హనుమంతరావు, చింతగుంట శ్రీనివాసరావు, న్యాయవాది కాసా అశోక్, కృష్ణంశెట్టి రమేష్‌బాబు పాల్గొన్నారు.

వరద బాధిత విద్యార్థులకు మౌంట్ పోర్ట్ వితరణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం, పెసర్లంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పెసరలంక పాఠశాల విద్యార్థులకు రేపల్లెకు చెందిన మౌంట్ ఫోర్ట్ హైస్కూల్ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం విద్యార్థులకు నిత్యావసర సరుకులు, దుస్తులతో కూడిన కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో మాన్ ఫోర్ట్ హై స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు వి గీత, కృష్ణకుమారి, రాజశేఖర్, వి ఏడుకొండలు,



విద్యార్థులకు సరుకులు అందజేస్తున్న మౌంట్ ఫోర్ట్ సిబ్బంది

పాఠశాల ఉపాధ్యాయులు వి సురేష్ కుమార్, పి శేఖర్ బాబు, ఏ జాకాబ్, మౌంట్ ఫోర్ట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎంను కలిసిన ఎమ్మెల్యే బీఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.





వరద బాధితులకు సహాయం అందించేందుకు సిద్ధమైన రోటరీ సభ్యులు

వరద బాధితులకు సాయమందిద్దాం

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ డిస్ట్రిక్ట్ 3150 ఆపద్బంధు పథకం ద్వారా వరద బాధితులకు ఒక్కొక్క కుటుంబానికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్స్ ఉచిత పంపిణీ కోసం సిద్ధం చేస్తున్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె శరత్ చౌదరి పిలుపు మేరకు స్థానిక రోటరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి సభ్యుల నుంచి వసూలు చేసిన రూ.57 వేల రూపాయల మొత్తానికి చెక్కు అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీకి అందించారు. ఈ సందర్భంగా రోటరీ కార్యదర్శి మురళీ సుధాకరరావు మాట్లాడుతూ కష్టకాలంలో తోటి మానవుడికి సహాయం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉన్నదని పేర్కొన్నారు. దివాకరదత్తు మాట్లాడుతూ కనీ వినీ ఎరుగని విపత్తు సంభవించిన సమయంలో బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సహాయం చేయాలని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం చేసిన సభ్యులను రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో మలాది శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, బాచిన పూర్ణచంద్రరావు, కాకర్ల వెంకటేశ్వర్లు అళహరి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాగద్వేషాలకు అతీతుడు ఆనందబాబు

ప్రజాశక్తి-వేమూరు

పార్టీలకు, కులం, మతం, ప్రాంతం వంటి రాగద్వేషాలకు నక్క ఆనందబాబు అతీతుడని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ అన్నారు. వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు పుట్టిన రోజును పురస్కరించుకొని పాఠశాలలో మంగళ వారం అనురాధ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు ప్రారంభించారు. అనురాధ మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని, సంక్షేమ రాజ్యస్థాపన జరగాలని కలలు కన్న ప్రజానాయకుడు ఆనంద బాబు అన్నారు. ఆయన వేసే ప్రతి అడుగు ప్రజల కోసమేనని, ప్రతి నిమిషం ప్రజాసేవకే అంకితం చేసిన మనసున్న నాయకుడు ఎమ్మెల్యే ఆనందబాబు అని ఆమె పేర్కొన్నారు. స్థానిక



ఆనందబాబు పుట్టినరోజు వేడుకల్లో అనురాధ తదితరులు

ప్రభుత్వ పాఠశాలలో అనురాధ ఆధ్వర్యంలో విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు, నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సోమరౌతు బ్రహ్మం, మురాల వాసుదేవ్ గౌడ్, దాస్, తాడికొండ కోటేశ్వరరావు, అమ్మయ్య, నాని, చందు, కొండిశెట్టి శివరామ ప్రసాద్, జనసేన, బీజేపీ, తెలుగుదేశం యువత నాయకులు, జనసేన వీరమహిళలు పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-అద్దంకి

మండల, పట్టణంలో ఏర్పాటు చేసిన గణనాధుని విగ్రహాలు నిమజ్జన కార్యక్రమాలు నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకొని దగ్గరలోని గుండ్లకమ్మ నదిలో నిర్వహించుకోవాలని సిఐ కృష్ణయ్య మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తిమ్మాయపాలెం సమీపంలోని గుండ్లకమ్మ నదిలో విగ్రహాల నిమజ్జనానికి వెళ్లే ఎందుకు దారులు సరిగా లేకపోవడంతో ప్రొక్లైన్ల సహాయంతో చిల్లచెట్లను తొలగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.16 వేలు పలికిన గణేశుని లడ్డూ

ప్రజాశక్తి-పర్చూరు

మండలంలోని ఉప్పుటూరు శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ బాజి 21 కిలోల నేతి లడ్డూను వినాయక విగ్రహానికి అందించారు. ఆ లడ్డూను వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన కుప్పాల సురేష్ రూ.16 వేలకు దక్కించుకున్నారు. వేలం అనంతరం మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వాడరేవు వద్ద నిమజ్జనానికి తరలించనున్నట్లు శివాలయం యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమం లో అర్చకులు కారంచేటి పిచ్చయ్య శాస్త్రి, మూలంరాజు కుమారస్వామి, నూతలపాటి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కృష్ణానది వరదల కారణంగా లంక గ్రామాలలో వాణిజ్య పంటలను కోల్పోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి నాగాంజనేయులు, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు, చింతమోటు గ్రామాలలో వరద ముంపునకు గురై దెబ్బతిన్న పంటలను సిపిఐ బృందం పరిశీలించింది. అనంతరం నాగాంజనేయులు, బాలాజీ మాట్లాడుతూ వరదల కారణంగా పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, గ్రామాన్ని యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, ఏఐటియుసి నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు, రైతులు కొసరాజు సతీష్, కొమ్మినేని శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పొలాల్లో పర్యటిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నపులివర్రులో శాస్త్రవేత్తల పర్యటన

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండల పరిధిలోని చినపులివర్రు గ్రామంలో మంగళవారం బాపట్ల జిల్లా శాస్త్రవేత్తలు పర్యటించారు. వ్యవసాయానికి సంబంధించిన వరి వంగడాలలో మందులు ఎలా పిచికారీ చేయాలి తదితర విషయాలపై రైతులకు తగు సూచనలు ఇచ్చారని కొల్లూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలాల్లో నీరు తగ్గిన తర్వాత ఎకరానికి 20 కిలోల పొటాషియం, తరువాత ఎకరానికి 200 గ్రాములు కార్బన్ డైజం అనే మందును పిచికారీ చేయాలని తెలిపారు. పొటాషియం వేసిన మూడు లేదా నాలుగు రోజుల తర్వాత 20 కిలోల యూరియా వేయాలని అన్నారు. వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ మృదుల, డాక్టర్ ఎన్ కామాక్షి, డాక్టర్ ఎం ఉష, మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించడమే లక్ష్యం

- ఆ దిశగా అధికారులు పనిచేయాలి
- కలెక్టర్ జె వెంకటమురళి ఆదేశం



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కొల్లూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, బాపట్ల జిల్లా

ఈ-క్రాప్‌లో పంటలు నమోదు కాకపోయినప్పటికీ నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, కౌలు రైతులు సాగు చేస్తున్న పంటలను సైతం సర్వే బందాలు పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. వరద ముంపునకు గురైన కష్ణా నది లంక గ్రామాలలో కేంద్ర బందం బుధవారం పర్యటిస్తుందని తెలిపారు. కేంద్ర బందం పర్యటన ఖరారు కావడంతో జిల్లా కలెక్టర్ మంగళవారం లంక గ్రామాలలో విస్తతంగా పర్యటించారు. కేంద్ర బందం ఏ ప్రాంతాల్లో పర్యటిస్తుందో పరిశీలించారు. వేమూరు, కొల్లూరు, బట్టిప్రోలు మండలాల్లోని గ్రామాలలో దెబ్బతిన్న గహాలు, పంటలను ఆయన పరిశీలించారు. తరచూ ముంపునకు గురవుతున్న సుగుణలంక చప్టా దిగువకు ఉండడంతో పరిశీలించారు. ఈపురులంకలో ఇప్పటికీ నీళ్లలోనే ఉండి పూర్తిగా దెబ్బతిన్న అరటి, పసుపు, బూడిద గుమ్మడి పంటలను పరిశీలించాలి. అరవింద వారధిలో నీటి ప్రవాహం, సమీపంలోనే కష్ణా నది గట్టుకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆవులువారిపాలెంలో పూర్తిగా దెబ్బతిని మునిగిపోయిన కొల్లూరు రాధాకృష్ణమూర్తి గహాన్ని పరిశీలించారు. ఇంట్లోకి వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు అందుతాయని హామీ ఇచ్చారు. వరద దాటికి కరకట్ట బలహీనపడి లీక్ అవుతున్న ఓలేరు కరకట్ట పల్లెపాలెం, ఓలేరు తూర్పు పల్లెపాలెం కరకట్టలను పరిశీలించారు. రావి అనంతవరం కరకట్టలను పరిశీలించారు. భట్టిప్రోలు మండలం కనగాల ప్రధాన కాలువ పక్కనే నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలించారు. పంటలు సాగు చేస్తూ నష్టపోయిన వారందరిని సర్వేలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. నీట మునిగిన పంటలు, గహాలన్నిటికీ నష్టపరిహారం అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను క్షుణ్ణంగా పరిశీలించిన తదుపరి నష్టం అంచనాలను నమోదు చేసుకోవాలని ఆయన ఆదేశించారు. వరద విపత్తుతో ముంపునకు గురైన లంక గ్రామాలలోని ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, రేపల్లె, చీరాల ఆర్డీవోలు హేలా షారోన్, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో నిర్దేశిత లక్ష్యాల సాధన

- సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ(డిసిసి), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ(డిఆర్‌సి) సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలు రకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 2024 మార్చి 31వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.17,988 కోట్లకు రూ.30,975.15 కోట్ల రుణాలు మంజూరు చేశారన్నారు. తద్వారా 172.19 శాతం ఆర్థిక ప్రగతిని సాధించారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.20,591.18 కోట్లుగా నిర్ణయించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలలో ఖరీఫ్‌లో రూ.3900.40 కోట్ల లక్ష్యానికి గాను, 2024 జూన్ 30వ తేదీ నాటికి రూ.2,368.97 కోట్ల రుణాలను అందజేసి 60.73 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామన్నారు. జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 32,657 స్వయం సహాయక సంఘాలకు 1671.03 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేయటం లక్ష్యమన్నారు. 2024 జూన్ 30వ తేదీ నాటికి 7982 స్వయం సహాయక సంఘాలకు 616.19 కోట్ల రూపాయాల రుణాలు మంజూరు చేసి.. 24.44 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. మెప్మా ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 1485 స్వయం సహాయక సంఘాలకు రూ.5940 కోట్ల రూపాయాల రుణాలు మంజూరు లక్ష్యం కాగా 2024 జూన్ 30వ తేదీ నాటికి 430 స్వయం సహాయక సంఘాలకు 5555.65 కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని, అందుకు సంబంధించి అర్హత పొందిన లబ్దిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపై ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ బ్యాంకు అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సిసిఆర్‌సి కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరికి ఈ ఏడాది రుణం అందించాలని తెలిపారు. సిసిఆర్‌సి కార్డులు ఉన్న రైతులంతా అర్హులేనని, వారిపై ఎలాంటి అనుమానాలకు తావు లేదని వారికి పంట రుణాలు, పశు రుణాలను అందజేసి ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత, లీడ్ జిల్లా మేనేజర్ రమేష్, డిఆర్‌డిఏ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు టి.వసుంధర, తేళ్ళ రవికుమార్, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖ అధికారులు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ బేబిరాణి, జనార్ధన్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి వై.గోపిచంద్, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఎపిఎంఐపి పిడి పివి రమణ, డిటిడబ్ల్యు ఒ జగన్నాథరావు, చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయకుమార్, అన్ని జిల్లా బ్యాంకు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

జ్వరపీడితులకు మెరుగైన వైద్యసేవలందించాలి

డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
కథనానికి స్పందన

ప్రజాశక్తి-తర్లుపాడు

విషజ్వరాల బారిన పడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న జ్వర పీడితులకు మెరుగైన వైద్య సేవలందించాలని మార్కాపురం డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.పద్మావతి తెలిపారు. ప్రజాశక్తి వార్తాపత్రికలో ప్రచురితమైన 'విజంభిస్తున్న విషజ్వరాలు' అనే కథనానికి స్పందించిన మార్కాపురం డిప్యూటీ డిఎంహెచ్ఓ పద్మావతి తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి డాక్టర్ హరీష్‌తో కలిసి వార్డును పరిశీలించి, వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులు, వారి బంధువులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆసుపత్రి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైరల్ ఫీవర్, డెంగ్యూ, ప్రబలుతున్నందున రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రాత్రి సమయంలో కూడా వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం స్థానిక బీసీ కాలనీలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి.. వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్.నాగేంద్ర రెడ్డి, పిహెచ్‌సి డాక్టర్ హరీష్, సిహెచ్ఓ తులసీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా హర్ష ప్రీతమ్‌దేవ్



నియామకపు ఉత్తర్వులను అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రకేసరి యూనివర్శిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్-ఎస్)కో ఆర్డినేటర్ గా సోషల్ వర్క్ విభాగంలో అధ్యాపకునిగా పని చేస్తున్న డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. గత సంవత్సరం కాలం పాటుగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గా ఆయన ఆంధ్ర కేసరి యూనివర్శిటీ అభివద్ధి కోసం చేసిన సేవలను పరిగణలోకి తీసుకున్న అధికారులు మరలా ఆ పోస్టులో నియమించారు. మంగళవారం విసి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి ,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు నుంచి నియామకపు ఉత్తర్వులను ఆయన అందుకున్నారు. దేవ్‌కుమార్‌ను యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి రాజ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలా మణి, సి. డిసి డీన్ డాక్టర్ జి.సోమ శేఖర, సోషల్ వర్క్ విభాగం హెచ్ఒడి. డాక్టర్ పిల్లి.వెంకట రావు, ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.శ్రీనివాస్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్

ప్రైవేటీకరణ యోచనను విరమించుకోవాలి

కార్మిక, రైతు సంఘాల ధర్నా



ఒంగోలులో ధర్నా చేస్తున్న కార్మిక, రైతు నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని పలువురు రైతు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ ఎదురు సాగర్ సెంటర్ లో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా జరిగింది. కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ ఎందరో త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ను ప్రైవేట్ పరం కానీయమన్నారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు -ఆంధ్రుల హక్కు నినాదం తో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, షేక్ మాబు, వి.బాల కోటయ్య, జె.జయంతిబాబు, కె.వీరారెడ్డి, సిఐటియు నాయకులు టి.మహేష్, తంబి శ్రీనివాసులు, జి.రమేష్, యం.అయ్యపరెడ్డి, పి.కల్పన, సిఐటియు నగర మాజీ అధ్యక్షులు దామా శ్రీనివాసులు, యు.ఆదిలక్ష్మి, బంకా సుబ్బారావు, టి.రాము, శ్రీకాంత్, రైతుకూలీ సంఘం జిల్లా నాయకురాలు ఎస్.లలిత కుమారి, ఏఐటియుసి నాయకులు ఎస్‌డి సర్దార్, సలార్, ఐఎఫ్‌టియు నాయకులు ఆర్. మోహన్ ,నాగరాజు, రాజశేఖర్, ఏఐయఫ్. టియు (న్యూ) నాయకులు ఎంఎస్ సాయి పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

బాపట్ల జిల్లా : రాష్ట్రంలోని భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడపడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందార్ అన్నారు. మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 వేల మందికి పైగా పనిచేస్తున్న ఏకైక పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్ అని, విశాఖ స్టీల్ ప్లాంట్ సాధన కోసం అనేకమంది ప్రాణత్యాగం చేశారన్నారు. అలాంటి పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ చేయడం కోసం నష్టాల ఊబిలోకి నెడుతుందని అన్నారు. ఇప్పటికైనా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు కె.శరత్, బుచ్చి రాజు, బ్రహ్మం, బాషా, వీరారెడ్డి పాల్గొన్నారు.



బాపట్లలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు